క్లుప్తంగా

సమష్టి కృషితో ముందుకు సాగాలి



ఫిరంగిపురం: సంఘ సభ్యులంతా సమష్టి కృషితో ముందుకు సాగాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పెదబాబు సూచించారు. స్థానిక సెయింట్‌పాల్స్ హైస్కూల్ ఆడిటోరియంలో శనివారం సాయంత్రం సంఘ మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెదబాబు మాట్లాడుతూ ఏ సమస్య వచ్చినా అందరూ కలసి పోరాడాలని, అందుకు జిల్లా శాఖ మద్దతు ఇస్తుందని చెప్పారు. త్వరలో నిర్వహించనున్న సంఘ జిల్లా సమావేశం ఫిరంగిపురంలో నిర్వహించేందుకు సన్నద్ధత వ్యక్తం చేశారు. అనంతరం బి.ప్రసాద్ సంఘ సభ్యత్వం స్వీకరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు జి.జోజప్ప, మండల శాఖ అధ్యక్షుడు టి.భాస్కర్, ప్రధాన కార్యదర్శి ప్రసాద్, ఆర్థిక కార్యదర్శి ఎస్కే జహంగీర్, కార్యవర్గ సభ్యులు సుందరరావు, మేడా శ్రీను, సాంబశివరావు, త్యాగరాజు, బి.ప్రసాద్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



మంగళగిరి: నగర పరిధిలోని తాడేపల్లి సీతానగరం ఘాట్ వద్ద గుర్తు తెలియని పురుషుడు మృతదేహం లభ్యమైంది. వయస్సు సుమారు 50 సంవత్సరాలు ఉంటాయి. కుడి చేతుపైన శంకర్, ఎడమ చేతిపైన పండు అని పచ్చబొట్లు ఉన్నాయి. వివరాలు తెలిసిన స్టేషన్‌లో సంప్రదించాలని తాడేపల్లి పోలీసులు సూచించారు.

ఏసీ లా కళాశాలలో వెబ్ ఆప్షన్ల నమోదుకు అనుమతి

గుంటూరు ఎడ్యుకేషన్: ఏసీ లా కళాశాలలో ప్రవేశాలకు సంబంధించి వెబ్ ఆప్షన్ల నమోదుకు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి నుంచి అనుమతి లభించినట్లు కరస్పాండెంట్ జి.ఎలీషా, ప్రిన్సిపాల్ అమృతవర్షిణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. లాసెట్‌లో అర్హత పొందిన విద్యార్థులు మూడేళ్లు, ఐదేళ్ల లా కోర్సుల్లో ప్రవేశాలకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈనెల 27వ తేదీ వరకు వెబ్ ఆప్షన్ల నమోదుకు అవకాశం ఉందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

డ్రైవర్లంతా అప్రమత్తతతో వ్యవహరించాలి



పట్నంబజారు: శిక్షణ పొందిన డ్రైవర్లంతా వాహనాలు నడిపేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎం.గోపాల్ చెప్పారు. నగరంలోని శ్రీ సాయి మారుతి హెవీ మోటారు డ్రైవింగ్ స్కూలులో శిక్షణ పూర్తి చేసుకున్న డ్రైవర్లకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవీఐ గోపాల్ మాట్లాడుతూ పూర్తి స్థాయిలో రహదారి భద్రతా నిబంధనలు పాటించాలని సూచించారు. ప్రయాణికుల్ని సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాల్సిన బాధ్యత డ్రైవర్లపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఎంవీఐలు మల్లేశ్వరి, సౌజన్య పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో జనరిక్ మందుల షాపు ప్రారంభం

గుంటూరు మెడికల్: జీజీహెచ్ క్యాజువాలిటీ ఎదుట డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జనరిక్ మందుల షాపును జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లాభాపేక్ష లేకుండా చౌక ధరలో జనరిక్ మందుల్ని రోగులకు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సమాఖ్య కమిటీ అధ్యక్షురాలు ఏ.శారమ్మ, కార్యదర్శి ఎం.ఝాన్సీరాణి, డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్, జనరిక్ మందుల షాపు ఇంచార్జి షంషేర్, స్త్రీ నిధి డైరెక్టర్ కె. అరుణ, జిల్లా సమాఖ్య కమిటీ సంయుక్త కార్యదర్శి చల్లా వాసంతి, కార్యవర్గ సభ్యులు కాకుమాను భూదేవి, బి. నాగరత్నం, జి. మల్లీశ్వరి పాల్గొన్నారు.

పురస్కారానికి రచయిత్రి సుజాత ఎంపిక



పాత గుంటూరు: గుంటూరుకు చెందిన రచయిత్రి ఏవీకే సుజాత ఒంగోలు కళా మిత్ర సంస్థ వారి రాష్ట్ర స్థాయి ప్రతిభా పురస్కారానికి ఎంపికయ్యారు. ఈనెల 26న ఒంగోలులో జరగనున్న కార్యక్రమంలో ఆమె పురస్కారాన్ని అందుకోనున్నారు. అమృత హృదయం, వ్యాస సుమాలు, నవ్యాంధ్ర నానీలు, బాలల కవితలు పుస్తకాలను ఆమె రాశారు. నవ్యాంధ్ర రచయితల సంఘ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. అనేక ప్రభుత్వ, ప్రైవేటు కార్యక్రమాల్లో సుజాత వ్యాఖ్యాతగా వ్యవహరించి ప్రముఖులు, ఉన్నతాధికారుల ప్రశంసలు పొందారు. ఆమె పురస్కారానికి ఎంపిక కావడంపై నవ్యాంధ్ర రచయితల సంఘ జిల్లా అధ్యక్షురాలు వేదాల విజయలక్ష్మి, సభ్యులు దుర్గాదేవి, లావణ్య, సీహెచ్. ఝాన్సీ, నాగసాయి అభినందనలు తెలిపారు.

అభివృద్ధి పనుల్ని త్వరితగతిన పూర్తి చేయండి

ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు



చేనేత భవన్‌ను పరిశీలిస్తున్న ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్యే ఆర్కే , ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు తదితరులు

మంగళగిరి: గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో చేపట్టిన అభివృద్ధి పనుల్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) అధికారులకు సూచించారు. ఆయన శనివారం ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలసి కొప్పురావూరు కాలనీలో రూ. 20లక్షలతో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సరఫరా పనుల్ని పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు.

➡ యర్రబాలెం శ్రీనగర్ కాలనీలో రూ. 10లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణం, శ్రీ లక్ష్మీనృసింహస్వామి ఆలయ కల్యాణ పుష్కరణి(పెద్ద కోనేరు) అభివృద్ధి పనుల్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

➡ పాత బస్టాండ్ ఆవరణలో తుది దశకు చేరుకున్న వైఎస్సార్ ప్రగడ కోటయ్య చేనేత భవనాలను ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు పరిశీలించారు. భవనాన్ని వెంటనే పూర్తి చేసి దుకాణాల్ని చేనేత వస్త్ర వ్యాపారులకు కేటాయించాలని, సత్వరమే తెనాలి రోడ్డు విస్తరణ చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర చేనేత విభాగం అధ్యక్షుడు గంజి చిరంజీవి, జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు ఆకురాతి రాజేష్, తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు బుర్రముక్క వేణుగోపాలస్వామిరెడ్డి, పట్టణ జేసీఎస్ కన్వీనర్ ఎండీ. ఫిరోజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్‌రాజు, నాయకులు సంకా బాలాజీ గుప్తా, కుంచాల కృష్ణ కిశోర్, సాలి ప్రశాంత్, పులివర్తి రాంబాబు, డీఈ కృష్ణారెడ్డి, ఏఈ కిశోర్ పాల్గొన్నారు.

➡ కాజలోని వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను ఎమ్మెల్యే ఆర్కే శనివారం సందర్శించారు. వైద్య సేవల గురించి రోగుల్ని అడిగి తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన వైద్యం అందించి నేషనల్ ఎష్యూరెన్స్ క్వాలిటీ (ఎన్క్యాస్) సర్టిఫికేట్ అందుకునేలా చర్యలు తీసుకోవాలని వైద్యులకు సూచించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ మొబీనా, కార్పొరేషన్ డీఈ కృష్ణారెడ్డి, ఏఈ కిశోర్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి పౌరుడుకీ ఓటు హక్కు వజ్రాయుధం



మాట్లాడుతున్న తాడికొండ తహసీల్దార్ ఫణీంద్ర బాబు

లాం(తాడికొండ): ఓటు హక్కు ప్రతి పౌరుడుకీ వజ్రాయుధం వంటిదని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువతీ, యువకుడు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ జి.వి.ఎస్. ఫణీంద్రబాబు తెలిపారు. మండలంలోని మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ఓటు హక్కుపై విద్యార్థిని, విద్యార్థులకు నిర్వహించిన అవగాహనా సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కుల, మత, వర్గ, ప్రాంతీయ భేదం లేకుండా ప్రతి ఒక్కరూ ఓటు వినియోగించుకునే హక్కు ఉందని తెలిపారు. మంచి ప్రభుత్వాల్ని ఎన్నుకోవడానికి దాన్ని వజ్రాయుధంగా వాడుకోవాలని సూచించారు. సమర్థవంతమైన నాయకత్వాన్ని ఎన్నుకోవడంపైనే దేశ, రాష్ట్ర భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని తెలిపారు. ఫారం-6 ద్వారా కొత్తగా ఓటు నమోదు, 6-ఎ ద్వారా విదేశీ భారతీయ ఓటర్లు, ఎలక్టోరల్ రోల్‌లో పేరును నమోదు చేసుకోవచ్చని చెప్పారు. ఫారం-7 ద్వారా ఇప్పటికీ ఉన్న ఓటర్ల జాబితాలో పేరు చేర్చడం, తొలగించడం, ఫారం-8 ద్వారా నివాసం మార్పు, ఇప్పటికే ఉన్న ఎలక్టోరల్ రోల్‌లోని ఎంట్రీల సవరణ కోసం ఉపయోగించాలని ఆయన సూచించారు. చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 30న జరిగే ఆన్‌లైన్ ఎన్‌రోల్‌మెంట్ ప్రాసెస్‌ను ఉపయోగించుకొని ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ బి. వంశీకృష్ణ, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ ఎస్‌డీ. నల్లా, వీఆర్వో జాన్ సైదా, కళాశాల ప్రిన్సిపాల్ కె. కిరణ్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ కె. నాగ శ్రీనివాసరావు, బీఎస్‌హెచ్ విభాగాధిపతి వి.వి. సుబ్బారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హింసలపై మహిళలంతా ఐక్యంగా పోరాడాలి

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వై. హరిహరనాథరావు



ప్రతిజ్ఞ చేస్తున్న వీవోఏలు, అంగన్‌వాడీలు, సచివాలయ మహిళా కానిస్టేబుళ్లు

తాడికొండ: మహిళలపై జరిగే ఎలాంటి హింసనైనా ఎదిరించి ఐక్యంగా పోరాడాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వై. హరిహరనాథరావు తెలిపారు. తాడికొండ మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. నేటి ఆధునిక సమాజంలో మహిళలు వంటింటికే పరిమితం కాకుండా చదువుకొని ఉన్నత ఉద్యోగాలలో కొలువై, అన్ని రంగాలలో ఉన్నతంగా రాణిస్తున్నారని తెలిపారు. సమాజంలో ఎదురయ్యే పలు రకాల హింసల్ని వ్యతిరేకించాలంటే వారికి చట్టాలపై అవగాహన అవసరమని చెప్పారు. అవగాహనా కార్యక్రమాల ద్వారా తెలుసుకున్న అంశాల్ని గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు తెలియజేసి, హింస రహిత సమాజాన్ని నెలకొల్పేందుకు తమ వంతు పాటుపడాలని ఆయన సూచించారు. ఎంపీడీవో అత్తోట దీప్తి మాట్లాడుతూ మహిళల విద్య, ఆరోగ్యం, ఆర్థికంగా ఎదిగేందుకు అవసరమైన నైపుణ్యాల సముపార్జన అనే అంశాలను వివరించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో పలు విభాగాల మహిళా సిబ్బందితో జెండర్ ఆధారిత హింసను అరికట్టేందుకు పాటుపడతామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో తాడికొండ ఎస్‌ఐ సీహెచ్. నాగార్జున, ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ కళావతి, డీఆర్‌డీఏ డీపీఎం జె. రాంబాబు, ఏసీవో ఏ. రాజ్యలక్ష్మి, ఏపీఎం సాంబశివరావు, సీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.

సైన్స్ పరిశోధనలతోనే దేశ పురోగతి



ప్రొఫెసర్ కరీంకు పట్టా అందజేస్తున్న చాన్సలర్ డాక్టర్ కోనేరు సత్యనారాయణ

మంగళగిరి: సైన్స్ పరిశోధనలతోనే దేశ పురోగతి సాధ్యమని ప్రపంచ సైన్స్ అకాడవి అధ్యక్షురాలు, ప్రొఫెసర్ క్వరై షా అబ్దుల్ కరీం అన్నారు. నగర పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ 13వ స్నాతకోత్సవం శనివారం ముగిసింది. ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ క్వరైషా మాట్లాడుతూ కోవిడ్- 19 ఇప్పటికీ మనతోనే కలసి ప్రయాణం చేస్తోందని, అది ప్రపంచ వ్యాప్తంగా మానవాళి పరస్పర అనుబంధాన్ని దెబ్బతీసిందని తెలిపారు. అదే సమయంలో సైన్స్ పరంగా ఒకరితో మరొకరు కలసి భాగస్వామ్యంలో పనిచేయడానికి పురిగొల్పిందని చెప్పారు. సంవత్సరం కంటే తక్కువ వ్యవధిలో ఆరు సమర్థమైన వ్యాక్సిన్ల అభివృద్ధికి శాస్త్రవేత్తలు కృషి చేయడం అభినందనీయమని తెలిపారు. భయం, అనిశ్చితి, ఆతృత నుంచి ప్రజలు ఆశలోకి వెళ్లడానికి వ్యాక్సిన్ దోహదపడ్డాయని పేర్కొన్నారు. అయితే, వ్యాక్సిన్లు కనుగొనడంలో లేదా తయారు చేయడంలో భాగస్వాములు కాని దేశాలకు కోవిడ్ పెను సవాల్‌గా మారిందని తెలిపారు. వ్యాక్సిన్ కలిగిఉన్న దేశాల వ్యవహార శైలి వైరస్ బలంగా మారలా తయారు చేసిందని చెప్పారు. టీకాలు వేసుకున్న కొంతమంది వ్యక్తులు అనుభవించే అసంబద్ధమైన దీర్ఘకాలిక పరిణామాల నుంచి తాము అనేక కొత్త విషయాలు నేర్చుకుంటున్నామని తెలిపారు. స్నాతకోత్సవం సందర్భంగా 4465 మంది విద్యార్థులకు డిగ్రీల ప్రదానం, 38 మందికి బంగారు పతకాలు, 41 మందికి రజిత పతకాలు అందజేశారు. గౌరవ అతిథు డాక్టర్ సి.ఎస్.ఆర్. రావు, అతిథి ప్రొఫెసర్ జి.యు. కులకర్ణి, సినీ నటుడు మురళీమోహన్‌కు చాన్సలర్ కోనేరు సత్యనారాయణ డాక్టరేట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో యూనివర్సిటీ కార్యదర్శి కోనేరు కాంచనలత, వీసీ డాక్టర్ జి. పార్థసారధివర్మ పాల్గొన్నారు.

30న అందుబాటులో మైనార్టీ కమిషన్ సభ్యులు

మంగళగిరి: నగరంలోని గౌతమ బుద్ధా రోడ్డులోని ఈద్గా ఎదురుగా ఉన్న రాష్ట్ర మైనార్టీ కమిషన్ కార్యాలయంలో ఈ నెల 30న సభ్యులు అందుబాటులో ఉంటారని ఆ కమిషన్ స్టేట్ చైర్మన్ డాక్టర్ కె. ఇక్బాల్ అహ్మద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, జైనులు, బౌద్ధులు, పారసీలంతా తమ సమస్యలు, ఫిర్యాదుల్ని కమిషన్‌కు రాతపూర్వకంగా తెలియజేసి పరిష్కరించుకోవచ్చని సూచించారు. కమిషన్ సేవల్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

జీజీహెచ్‌లో ఆరోగ్యమిత్రలకు బయోమెట్రిక్

గుంటూరు మెడికల్: జీజీహెచ్‌లో పనిచేసే ఆరోగ్య మిత్రలకు డిసెంబర్ 1 నుంచి ఎఫ్‌ఆర్‌ఎస్, బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేస్తున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ తెలిపారు. ఆసుపత్రిలోని జగనన్న ఆరోగ్య సురక్ష సమాచార కేంద్రానికి వచ్చే రోగులకు ఆరోగ్య మిత్రలు సేవలు అందించే విషయంలో అలసత్వం వహిస్తున్నారన్న ఆరోపణలపై స్పందించి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు బయోమెట్రిక్ హాజరు అమలు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

బాలకుటీర్‌లో లలిత కళా ఉత్సవ పోటీలు ప్రారంభం



చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: శ్యామలానగర్‌లోని శ్రీ వేంకటేశ్వర బాలకుటీర్‌లో శనివారం లలిత కళా ఉత్సవంలో భాగంగా మొదటి విడత రాష్ట్రస్థాయి పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కవిత, కథ, లేఖారచనతో పాటు మధ్యాహ్నం చిత్రలేఖన పోటీల్ని నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 35 పాఠశాలల నుంచి 500 మందికి పైగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నట్లు బాలకుటీర్ వ్యవస్థాపకురాలు డాక్టర్ ఎస్. మంగాదేవి తెలిపారు. విద్య అంటే పుస్తక పరిజ్ఞానం ఒకటే కాదని, కళలు సైతం అందులో ఒక భాగమేనని చెప్పారు. బాలల్లోని సృజనాత్మకతను వ్యక్తీకరించేందుకు, మానసికోల్లాసానికి లలిత కళలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. బాల్య దశ నుంచే కళలపై ఆసక్తి కలిగించినట్లయితే బాలలు సున్నిత భావాలతో ఎదిగి, విలువలను అలవర్చుకొని మంచి పౌరులుగా సమాజంలో నిలబడగలుగుతారని వివరించారు. డిసెంబరు 10న సంగీతోత్సవంలో భాగంగా బాలలకు గాత్రం, వాద్యం, బృందగాన పోటీలు నిర్వహిస్తామని, అదే రోజు సాయంత్రం లలిత కళా ఉత్సవంలో రచయితలకు పురస్కారాలు, రాష్ట్రస్థాయి పోటీల విజేతలకు బహుమతి ప్రదానం చేస్తామని ఆమె వెల్లడించారు.

జగనన్న గోరుముద్ద మెనూ విధిగా పాటించాలి



విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న ఖాసిం

గుంటూరు ఎడ్యుకేషన్: జగనన్న గోరుముద్ద మెనూ విధిగా పాటించి, విద్యార్థులకు బలవర్ధకమైన పౌష్టికాహారాన్ని అందించాలని ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం ఉపాధ్యాయులకు సూచించారు. ఏటీ అగ్రహారంలోని ప్రభుత్వ ఉర్దూ ప్రాథమిక పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం చేసి, ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. అనంతరం పాఠశాల రికార్డులతో పాటు విద్యార్థుల వర్క్‌బుక్స్‌ను పరిశీలించి, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



రోడ్డును పరిశీలిస్తున్న నూరిఫాతిమా

పట్నంబజారు: తూర్పు నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికి అహర్నిశలు కృషి చేస్తామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరిఫాతిమా చెప్పారు. నియోజకవర్గంలోని 13వ డివిజన్, గుంట ఫ్యాక్టరీ రోడ్డులో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నూరిఫాతిమా మాట్లాడుతూ గత ప్రభుత్వం రోడ్ల నిర్మాణ పనుల అంశంలో చేసిన తప్పుల వల్ల ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రిగా వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత పూర్తి స్థాయిలో నగరాభివృద్ధి జరుగుతోందని తెలిపారు. రూ. 20 లక్షలతో రోడ్డు నిర్మాణం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ సంకూరి శ్రీనివాస్, పార్టీ నేతలు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు



ఆటోడ్రైవర్లు, విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ కోటేశ్వరరావు

పట్నంబజారు: విద్యార్థుల్ని తరలిస్తున్న ఆటోల్ని శనివారం నగర ట్రాఫిక్ విభాగం ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. ఈస్ట్ సబ్ డివిజన్ సీఐ కోటేశ్వరరావు, వెస్ట్ సబ్ డివిజన్ సీఐ కె.శ్రీనివాసరావు నేతృత్వంలో నగరంలోని ముఖ్య కూడళ్లలో సిబ్బంది తనిఖీలు చేపట్టారు. అనుమతులకు మించి తరలిస్తున్న వాహనాల్ని నిలువరించి, ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం పలువురికి జరిమానాలు విధించారు.

స్వచ్ఛంద వైద్య సేవలపై అవగాహన ఒప్పందం



డాక్టర్ రఘు నుంచి ఒప్పంద పత్రాన్ని అందుకుంటున్న ఎస్వీ రమణ

గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతి రోడ్డులోని ప్రభుత్వ ఛాతీ, సాంక్రమిక వ్యాధుల ఆస్పత్రితో స్వచ్ఛంద సేవలకు అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు హిందూ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ తెలిపారు. ప్రభుత్వ ఛాతీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్. రఘుతో జరిగిన చర్చల అనంతరం శనివారం అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. డాక్టర్ ఎస్. రఘు మాట్లాడుతూ స్వచ్ఛంద సేవా సంస్థ అనుభవం విద్యార్థులు పాఠ్యాంశాలకు సంబంధించిన విజ్ఞానం, నాయకత్వ లక్షణాలు, సామర్థ్యాల్ని పెంపొందించుకోవడంలో సహాయ పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంబీఏ విభాగాధిపతి వి. చక్రవర్తి పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



గుంటూరు ఈస్ట్: వ్యక్తి అదృశ్యంపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. శ్రీనగర్ 7వ లైనులో నివసించే బి.ప్రభుకిశోర్ రెండు రోజుల కిందట ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ఎటో వెళ్లిపోయాడు. అతని ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫొటోలోని వ్యక్తిని గుర్తించిన వారు 6304572079 నంబరుకు సమాచారం అందించాలని కోరారు.

అరండల్‌పేట సీఐగా వెంకటేశ్వరరెడ్డి



గుంటూరు ఈస్ట్: అరండల్‌పేట పోలీస్ స్టేషన్ సీఐగా ఐ.వెంకటేశ్వరరెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. 1998లో ఎస్‌ఐగా విధుల్లో చేరిన ఆయన 2011లో పదోన్నతి పొందారు. ప్రస్తుతం నెల్లూరు జిల్లా సూళ్లూరుపేట సీఐగా విధులు నిర్వహిస్తూ బదిలీపై అరండల్‌పేట వచ్చారు.



ఆలయంలో వీవీఐటీ కళాశాల విద్యార్థులు వెలిగించిన కార్తిక దీపాలు



దీపాలంకరణలో స్వామి



ఆలయంలో వీవీఐటీ కళాశాల విద్యార్థులు వెలిగించిన కార్తిక దీపాలు

నృసింహస్వామికి సహస్ర దీపాలంకరణ

మంగళగిరి: నగరంలోని గల శ్రీ లక్ష్మీనృసింహస్వామి శనివారం రాత్రి సహస్ర దీపాలంకరణలో దర్శనమిచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కార్తిక దీపాలు వెలిగించిన వీవీఐటీ విద్యార్థులు

పెదకాకాని నంబూరు వీవీఐటీ కళాశాల విద్యార్థులు శనివారం పెద్దఎత్తున నృసింహస్వామి ఆలయాన్ని సందర్శించారు. ఆలయ ఆవరణలో శంకు, చక్ర ఆకారంలో వారు వెలగించిన కార్తిక దీపాలు భక్తులను ఆకట్టుకున్నాయి.